నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

ఆదివారం | డిసెంబర్ 17, 2023 | www.navatelangana.com

రేపు బాల బాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు డిసెంబర్ 18న సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ పరిమళ, జిల్లా కబడ్డీ కార్యదర్శి రాంచందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14,17 సంవత్సరాల బాల బాలికల టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహించబడుతుందని, ఆసక్తి గల క్రీడాకారులు టీంగా రావాలని తెలిపారు. గెలుపొందిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించే విధంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు సోమవారం టీంలను తీసుకొని ఉదయం 9గంటలకు శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో పిఈటి సదానందానికి రిపోర్టు చేయాలని తెలిపారు.

నూతన పోలింగ్ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ - సిర్పూర్(టీ)

ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు మండలంలోని ఇటుకల్‌పహాడ్ గ్రామంలో నూతన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ రాజేశ్వర్ పరిశీలించారు. శనివారం ఇటుకల్‌పహాడ్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటర్లతో వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎంఈఓ సోమయ్య, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ దేవీచంద్, ఆర్‌ఐ జుగాదిరావు పాల్గొన్నారు.



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిరసన



నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా, లారీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లు వేసి స్పీడ్ బ్రేకర్లు మరిచారన్నారు. వెంటనే చౌరస్తాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని రోడ్డుపై బైటాయించి నిరసన చేపట్టారు. స్పీడ్ బ్రేకర్లతో పాటు సిగ్నల్‌లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, సాయికృష్ణ, సీఐటీయూ నాయకులు సంజీవ్, శంకర్, కెవిపిఎస్ నాయకులు రవికుమార్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భీమేష్, నాయకులు నితీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



నవతెలంగాణ-భీమిని

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో కలలను ఎలా సాకారం చేసుకోవాలనే అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జవహర్, పంచాయతీ అధికారి శేక్ సఫ్దర్ అలీ, ఇంజనీర్ రాంచందర్, డాక్టర్ సరిత, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్‌రావు, వీణ, జావెద్, సాయిదీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి పాల్గొని విద్యార్థులు లక్ష్యం వైపు ఎలా అడుగులు వేయాలో వివరించారు. విద్యార్థుల్లో కొందరు డాక్టర్, ఇంజనీర్, పోలీస్ కావాలని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. లక్ష్యం చేరుకోవడానికి ఇప్పటి నుండే దృష్టి సారించాలని సూచించారు. ప్రతి 3వ శనివారం విద్యార్థుల పురోగతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

జీఎం కార్యాలయ ఉద్యోగులకు ఆటల పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు శనివారం సెంట్రల్ నర్సరీలో త్రోబాల్, గ్ ఆఫ్ వార్, పురుష ఉద్యోగులకు వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ రఘుకుమార్ హాజరై మాట్లాడారు. మహిళా, పురుష ఉద్యోగులు అందరూ ఉత్సాహంగా ఆట పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని, ఆటల పోటీలలో ఉద్యోగులు తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందించదగిన విషయమని తెలిపారు. అలాగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం (ప) పి అరవింద రావు,ఆర్కే 5 అండ్ 6 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ రమణ రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసు హనుమాన్‌గౌడ్,ఎస్ఆర్పీ ఓసీ ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి,సీనియర్ పీఓ పి కాంతారావు, ఎస్టేట్స్ ఆఫీసర్ స్వప్న, సీనియర్ లా ఆఫీసర్ ప్రబంధిత, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో చదువుతున్న జాడి మారుతి ఎంపికైనట్లు పీడీ సట్ల శంకర్ తెలిపారు. ఈ నెల 13 నుండి మందమర్రి లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయికి విద్యార్థి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్, పీఈటీ కోట యాదగిరి, ఉమ్మడి ఆదిలాబాద్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బి.బాబురావు, హౌస్ మాస్టర్ కోసరి మహేష్‌చంద్ర, కళాశాల అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు.

18న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ సెలక్షన్స్

ఆసిఫాబాద్: ఈ నెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్ 20, అండర్ 18, అండర్ 16 బాల బాలికలు ఈ పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీలో ఎంపికైన వారు ఈ నెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయికి ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఎస్ఐఎస్ అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్ 8008090626 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బెల్టు తొలగిపోతుందా..?

- జిల్లాలో విచ్చలవిడిగా వెలిసిన మద్యం దుకాణాలు
- అనుమతులు లేకపోయినా కొనసాగుతున్న దందా
- మామూలుగా తీసుకుంటున్న ఆబ్కారీ శాఖాధికారులు
- తాజాగా మూసివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు

పల్లెల్లో ఆరోగ్యానికి అవసరమైన మెడికల్ షాపులు లేవు కానీ..మద్యం దుకాణాలకు మాత్రం కొదువలేని పరిస్థితి ఉంది. ప్రతి పల్లెలో..ప్రతి గల్లీలో విచ్చలవిడిగా వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ దుకాణాలు కొనసాగుతున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఈ దుకాణాలను అరికట్టాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా పల్లెల్లో మద్య ఏరులై పారుతోంది. సులువుగా మద్యం లభించడంతో గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. అనేక పచ్చని కుటుంబాల్లో చిచ్చు రేపుతోందనే వాదన వినిపిస్తోంది. బెల్టు దుకాణాలు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నా వాటికి ఎవరూ ఖాతరు చేయడం లేదు. అడ్డుకోవాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా బెల్టు దుకాణాలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో..ఇప్పటికైనా తొలగిపోతాయా..? లేదా అనేది చర్చనీయాంశంగా మారుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వమే మద్యం దుకాణాలకు అధికారిక అనుమతులు ఇస్తుంటుంది. ప్రభుత్వ ఆదాయానికి ఈ దుకాణాలు వనరుగా ఉపయోగపడుతాయనే ఉద్దేశంతో రెండేండ్లకు ఒకసారి టెండర్లు నిర్వహించి దుకాణాలను కేటాయిస్తుంది. తాజాగా ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో 41 దుకాణాలకు అధికారికంగా టెండర్ నిర్వహించి లక్కీ డ్రా ద్వారా కేటాయింపులు చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా కేవలం ప్రభుత్వం అనుమతించిన వాటిని మాత్రమే నిర్వహించాలి. కానీ జిల్లాలో అనేక పల్లెల్లో విచ్చలవిడిగా అనధికారికంగా బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. కొన్ని పల్లెల్లో గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి అనధికారికంగా ఈ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఇష్టారీతిన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వీటికి ప్రభుత్వ అనుమతులు కలిగిన మద్యం దుకాణాల నుంచే సరఫరా జరుగుతుందని తెలుస్తోంది. ఏండ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా ఈ దందా కొనసాగుతున్నా..అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోపక్క అనుమతులు కలిగిన మద్యం దుకాణాల్లో లభించే ధరల కంటే బెల్టు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తుంటారు. గ్రామంలోనే సులువుగా లభిస్తుందనే ఉద్దేశంతో అనేక మంది మద్యానికి అలవాటు పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా.. అనధికారికంగా నిర్వహిస్తున్న ఈ బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా తొలగిపోతాయా..?

జిల్లాలో ఏండ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఎన్నికల సమయంలో పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడ బెల్టు దుకాణాలను మూసివేయించింది. ఎన్నికల్లో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలనే ఉద్దేశంతో ఎన్నికల యంత్రాంగం వీటిపై ఉక్కుపాదం మోపింది. ఆదిలాబాద్ జిల్లాలో కేవలం నెల రోజుల వ్యవధిలోనే 310 మద్యం దుకాణాలను మూసివేయించి 4200లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 406 కేసులు నమోదు చేసి 408మందిని అరెస్టు చేసింది. ఎన్నికల కోడ్ ముగిసిపోగానే మళ్లీ ఎక్కడికక్కడ బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. అనేక పల్లెలు మత్తులో మునిగి తేలుతున్నాయి. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తొలుత ఈ బెల్టు దుకాణాలపైనే దృష్టిసారించింది. అనధికారికంగా నిర్వహిస్తున్న ఈ మద్యం దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వం ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికైనా ఈ బెల్టు దుకాణాలు తొలగిపోతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి వీటిని పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టుబడిన మద్యం(ఫైల్)

నిబంధనల మేరకు చర్యలు : శ్రీనివాస్,ఆబ్కారీశాఖ సీఐ

జిల్లాలో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

గెలుపు దిశగా ఎస్‌సీఈయూ

- డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(ఎస్సీఈయూ-సీఐటీయూ) గెలుపు దిశగా పయనిస్తోందని డిప్యూటీ జనరల్ సెక్రెటరీనాగరాజు గోపాల్ అన్నారు. శనివారం ఎస్ఆర్పీ 3గనిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలలో గెలిచిన ప్రభుత్వాలు ఏవి ఉంటే అందులోకే నాయకులు మారడం చూస్తుంటే కొత్త సీసాలో పాత సారా మాదిరి తయారవుతోందని అన్నారు. ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పి నిజాయితీగా పనిచేసే సీఐటీయూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలుపులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలలో గెలిచిన నాయకులు, కార్మికులకు కొన్ని అవగాహన లేని ఒప్పందాలు చేసుకోవడంతో ఒక్కసారికే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ముందు చూపుతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవడమే నాయకుల లక్ష్యమని, అలాంటి లక్షణాలు ఉన్న నాయకులు ఇప్పుడు లేరని, కేవలం పాత నాయకుల పేర్లు చెప్పుకొని కాలం గడుపుకుంటున్నారని అన్నారు. నాయకులంటేనే పైరవీ కారులుగా తయారైందని, గెలిచిన యూనియన్లకు బుద్ధి చెప్పి కార్మికుల నుండి కొత్త నాయకులను తయారు చేసే సీఐటీయూకే ఈసారి గెలవడానికి వంద శాతం అవకాశాలు ఉన్నందున కార్మికులు గమనించాలని కోరారు. సాధ్యమయ్యే హామీలే సిఐటియుగా చెబుతామని, సాధ్యం కానీ హామీలను చెప్పమని, గత కొన్ని ఏళ్లుగా తాము చేస్తున్న పోరాటాల వలన కార్మికులకు చైతన్య వచ్చిందని తెలిపారు. మిగిలిన యూనియన్లు చివరకు రాజకీయ పార్టీలు సైతం అవే డిమాండ్లు చెబుతున్నారని, అన్ని యూనియన్ల చేత కార్మిక సమస్యలపై మాట్లాడించే, ఆందోళనలకు సైతం కదిలించే సత్తా కేవలం సిఐటియుకే ఉందని, అలాంటి యూనియన్ వస్తేనే కార్మికుల హక్కులు కాపాడబడతాయని తెలిపారు. గెలిచిన సంఘాలు, ప్రభుత్వాలు పక్కనే గోదావరి ఉన్న పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయించలేకపోతున్నారని, గని సమస్యలే కాకుండా స్థానిక సమస్యలపై పోరాటం చేయడం వల్ల మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందని తెలిపారు. ఆసుపత్రిలో మందుల విషయంలోనూ యాజమాన్యం ఆలోచించి నిధులను విడుదల చేస్తున్న తీరును కార్మికులు గమనించాలన్నారు. ఏ గనికి వెళ్లిన కార్మికులు సాదరంగా ఆహ్వానం పలుకుతూ గెలుపు ఈసారి మీదేనని చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, చీకట్ల సాగర్, అజయ్, సాయిల శ్రీనివాస్, సదానందం, ఇప్ప నరేష్, ఆవునూరి మహేష్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్మినా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ అన్నారు. శనివారం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిర్పూర్ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా మండలంలోని వివిధ గ్రామాల నుండి అక్రమంగా ఎలుములె సంతోష్‌తో పాటు 20 మంది వద్ద 34 క్వింటాళ్ల 17 కిలోల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వారిని విచారించగా వివిధ ప్రాంతాలకు చెందిన రేషన్‌కార్డుదారుల నుండి బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి మహారాష్ట్రలోని పోసా గ్రామంలోని బొమ్మకంటివార్ అబుల్ భారత్ జార్, చౌదరి మొరేశ్వర్, సత్తులె ధనుంజయ్, లలిత్ కుమార్ సోనీ అనే వ్యక్తులకు చెందిన దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నామని తెలిపారు.



సీఐటీయూ వైపు కార్మికుల చూపు



నవతెలంగాణ-మందమర్రి

సంస్థలో ఒత్తిడికి గురవుతున్న కార్మికులు హక్కులు సాధించి పెట్టే సీఐటీయూపై చూస్తున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి అన్నారు. మందమర్రి కెకె 5 గనిపై యూనియన్ పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. సింగరేణిలో చాలా రోజులుగా కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బాధ్యతలు గుర్తు చేస్తూ హక్కులు సాధించిపెట్టే సీఐటీయూను కార్మికులు ఆదరిస్తున్నారని, ఈసారి యూనియన్ గుర్తు అయిన ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్మికులు యూనియన్‌ను గెలిపిస్తే ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఇప్పుడున్న క్వార్టర్ అలాట్మెంట్ వ్యవస్థను పూర్తిగా మార్చి పారదర్శకంగా ఇప్పిస్తామన్నారు. సేఫ్టీ సమావేశాలలో అనుభవజ్ఞులకే ప్రాధాన్యత ఇస్తామని, యూనియన్ కార్యకర్తలకు కాదని స్పష్టం చేశారు. అధికారులు ఎవరి పనిని వారు నిరభ్యంతరంగా చేసుకోవచ్చని, పైరవీల కోసం అధికారులపై ఒత్తిడి తేమని తెలిపారు. అధికారుల తీరుతో సూపర్వైజర్లు కిందిస్థాయి కార్మికులపై ఒత్తిడి పెరుగుతుందని, దీన్ని తగ్గించేలా సూపర్వైజర్లు, ట్రేడ్స్‌మెన్స్ సమస్యలను స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కోల్ ఇండియా క్యాడర్ స్కీంను, చార్జ్ అలవెన్స్‌ను కోల్ ఇండియా మాదిరి ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. అనంతరం జీఎం ఆఫీసు జూనియర్ అసిస్టెంట్ సందీప్‌ను రాజారెడ్డి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట్ స్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు ఆరిఫ్, శ్రీధర్, రాజ్‌కుమార్ పిట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అవగాహనకు భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్ భవన ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి హుస్సేన్‌తో కలిసి జిల్లాలో ఈ నెల 16 నుండి జనవరి 26, 2024 వరకు నిర్వహించనున్న భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్‌దయాల్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవనజ్యోతి బీమా యోజన వంటి పథకాలపై గ్రామాలలో ప్రజలకు అర్థమయ్యే విధంగా భారత్ వికసిత్ సంకల్పయాత్ర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రచార యాత్రను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామానికి ప్రచార రథం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, ఐకెపి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సిద్ధం కావాలి

- ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుడు గుండా థామస్



నవతెలంగాణ - హాజీపూర్

ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చర్వాక హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో థామస్ మాట్లాడుతూ మాదిగ జాతి భవిష్యత్ కోసం మాదిగ సమాజం మొత్తం ఎంఆర్పీఎస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. మాదిగ జాతి మొత్తం మందకృష్ణ మాదిగ వెంట నడిచి వర్గీకరణ లక్ష్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ, ఎల్కటూరి వేణు, ఎంఎస్పీ నియోజకవర్గ నాయకులు మంతెన మల్లేష్, చెన్నూరి శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, చకినారపు మల్లేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | డిసెంబర్ 17, 2023 | www.navatelangana.com

పీచర ఉన్నత పాఠశాలకు ప్రింటర్ అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద



పీచర గ్రామ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన డాక్టర్ ఎర్ర దామోదర్‌రెడ్డి శనివారం సుమారు రూ.20 వేల విలువ గల ప్రింటర్ విరాళంగా అందజేశారు. పాఠశాల అవసరాల కొరకు ప్రింటర్ అందజేసినట్టు దాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రిమ్స్ జూడాల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ రిమ్స్ జూడాలు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిశారు. తమ డిమాండ్లతో కూడిన పత్రాన్ని జూడాల రిమ్స్ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. తమ డిమాండ్లను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని కలెక్టర్ తెలిపినట్టు వారు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మెడికోలు ఉన్నారు.

మా ఊళ్లోనే పాఠశాల నడపాలి

- గ్రామస్తులు, పోషకుల తీర్మానం



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను వెంటనే తెరిచి పేద విద్యార్థులకు విద్య అందించాలని శనివారం పోషకులు, గ్రామస్తులు తీర్మాణం చేశారు. పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో తీర్మానం చేశారు. పేదవిద్యార్థులకు న్యాయం జరగాలంటే ఉన్నతాధికారులు వెంటనే చించాలలో మూసి ఉన్న పాఠశాల తెరిచి, సర్దుబాటు కింద ఇతర పాఠశాలకు పంపిన ఉపాధ్యాయులను తిరిగి చించాల పాఠశాలకు పంపాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజిరెడ్డి, పాఠశాల విద్య కమిటీ చైర్మెన్ శంకర్, పోషకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేత



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన వికలాంగుడు పొలాస రాజన్నకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటస్వామి మాట్లాడుతూ నిరుపేదలకు అండగా లయన్స్ క్లబ్ తమ వంతు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పి.సుదర్శన్, ఎం.జితేందర్, సందీప్ కుమార్, వై. భీంరావు, రామచందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ముధోల్‌లో ఘనంగా మహా పడిపూజ



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని పశుపతి నాథ్ శివాలయం ఆవరణలో శనివారం ముధోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక మహా పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ అయ్యప్ప సేవా సమితి ఆలయ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రాజు గురుస్వామి స్వహస్తల మీదుగా స్వామి వారికి ప్రత్యేకపూజలు, మహా అభిషేకం చేపట్టారు. స్వామి వారి శరణుఘోషతో ఆలయ పరిసరాలతో పాటు మండల కేంద్రం మారుమోగింది. ముధోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురుస్వాములు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురు స్వాములు సన్మానించారు. మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్ హెచ్ఎంఎస్



నవతెలంగాణ-రెబ్బెన

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక యూనియన్ హెచ్ఎంఎస్ అని బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా మందమర్రి వైస్ ప్రెసిడెంట్ పర్వతి రాజిరెడ్డి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఓజీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే సింగరేణి యూనియన్ ఎన్నికల్లో హెచ్ఎంఎస్ తరాజు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్మికులకు సొంతింటి పథకం అమలుచేస్తామని, ఇన్‌కమ్‌టాక్స్, రియింబర్స్‌మెంట్ అమలుచేస్తామని, కార్మికుల పిల్లలు చదువుకోవడానికి సీబీఎస్ఈ విద్య సింగరేణి పాఠశాల పునరుద్ధరణ, టెక్నికల్ స్టాఫ్ సమస్యలు, అపరేటర్ సమస్యలు, ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంపీసీ ఫిట్ సెక్రకరీ ఎం.శ్రీనివాస్, ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ శ్రీనివాస్, సీహెచ్‌పీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఎం.ఉమామహేశ్వర్, ఏరియా ఆర్గనైజర్ దత్తు, ఏరియా టెక్నీషన్ ఆర్గనైజర్ మంథెన వేణుగోపాల్, శాంతిఖని ఫిట్ సెక్రటరీ కార్తీక్, ఆర్గనైజర్స్ వెంకటేశ్, ఓంకార్, దశరథం, భిక్షపతి, బాలేష్ పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్నాం..ఆదుకోండి సారూ

- ఖానాపూర్‌లో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్ల ర్యాలీ
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఖానాపూర్

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో తాము ఉపాధి కోల్పోయామని తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం ఖానాపూర్ ఆటో, టాటా మ్యాజిక్ యూనియన్ల సంఘ సభ్యులు కోరారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయడంతో తాము ఉపాధిని కోల్పోయామని తమను నమ్ముకున్న తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఖానాపూర్ మండల ప్రయివేట్ వాహన డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరము అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ పథకం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు రమేష్, నరేష్, చందు, శ్రీనివాస్, ఆనంద్, చిన్నయ్య, మున్నా, కలీం, అబ్బు, రాజన్న, మల్లయ్య ఉన్నారు.

బోథ్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం బోథ్ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో కార్మికులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించి, కార్మిక కుటుంబాలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటో కార్మికులు ఏకతాటిపై వచ్చి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బోథ్ మండల అధ్యక్షుడు శాకిర్, కార్యదర్శి నౌషాక్ దేవిదాస్, నాయకులు రంజిత్, ప్రభాకర్, జానీ, మాజర్, హైమద్, సుమేర్ పాషా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

తలమడుగు : కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు అన్నారు. శనివారం తలమడుగు, తాంసి ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో ఖోడద్, హస్నాపూర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గిపోయిందని అన్నారు. దీంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు ఆటోలో ప్రయాణించకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం ప్రతి నెల ఆర్థికంగా అండగా నిలువాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని డిమాండ్ చేశారు.



ఖానాపూర్‌లో...



తలమడుగులో...

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

- దేశ సరిహద్దు విధులపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరం కొనసాగుతోంది. ఈ నెల 11న శిబిరం ప్రారంభం కాగా ప్రతి రోజు కెడెట్లకు మ్యాప్ రీడింగ్, డ్రిల్, ఫైరింగ్ తదితర అంశాల్లో శిక్షణ నిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శిక్షణా అధికారి గాలి అశోక్ నేతృత్వంలో దేశ సరిహద్దుల్లో సైన్యం నిర్వర్తించే విధులపై అవగాహన, శిక్షణను నిర్వహించారు. సెక్షన్ కమాండర్, సెక్షన్ ఆఫీసర్ నేతృత్వంలో కమాండింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి, సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం, ప్రత్యర్థి మూకలను చాకచక్యంగా మట్టుబెట్టడం, దురదృష్టవశాత్తు గాయాలపాలైన, మృతి చెందిన తమ సహచర జవాన్లను రక్షించడం వంటి అంశాలపై మాల్ నిర్వహించారు. వీరి ప్రదర్శనతో పోలీసు శిక్షణా కేంద్రంలో దేశ సరిహద్దు వాతావరణం ఏర్పడింది. దేశ సరిహద్దుల్లో సైన్యం నిర్వర్తించే విధులు, శత్రు దేశాల కవ్వింపు చర్యలను ఎదుర్కొనే తీరుపై అవగాహన, శిక్షణను నిర్వహించినట్లు శిక్షణా అధికారి గాలి అశోక్ తెలిపారు. ఏకె 47, ఎస్-ఎల్ఆర్‌లను వినియోగిస్తూ ప్రత్యర్థులను ఎదుర్కొనే మెళకువలపై శిక్షణనిచ్చినట్లు వెల్లడించారు. ఈనెల 19 వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ 32 బెటాలియన్ కమాండర్ కల్నల్ వికాస్, ఎంఎం సతీష్ కుమార్, డిప్యూటి కమాండర్ జగ్‌రామ్, పూర్ణచందర్, హవల్దార్ బ్రిజేష్ సింగ్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 21న నిర్వహించ తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న ఢిల్లీలో మహాధర్నాను చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఎస్సీవర్గీకరణ అంశాన్ని నీరుగార్చాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని చెప్పిన బీజేపీ ఆ హామీని నెరవేర్చకుండా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షులు అడెల్లు, అధ్యక్షులు, బండారి అశోక్, ప్రధాన కార్యదర్శి సుద్దాల శివకుమార్, నాయకులు ఉన్నారు.

ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ-బాసర



ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో బయోసైన్స్ విభాగంలోని అధ్యాపకునిగా విధులు నిర్వర్తిస్తున్న శీలం రామారావుకి డాక్టరేట్ అవార్డును ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శనివారం ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ ఆచార్య సతీష్ కుమార్ డాక్టరేట్ అవార్డు పొందిన అధ్యాపకుడు డాక్టర్. శీలం రామారావుకి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీలో ఇప్పటికే అధ్యాపకులు డాక్టరేట్ అవార్డులు పొంది ఉన్నారని అందులో మరొక అధ్యాపకుడు పీహెచ్‌డీ అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పరిశోధన రంగంలోనూ నాణ్యమైన విద్యను అందించడంలోనూ వీరి పాత్ర ఎంతో కీలకమన్నారు. శీలం రామారావు "ఇకలాజికల్ ఇంప్లికేషన్స్ అండ్ కన్జర్వేషన్ స్ట్రాటజీస్ స్ట్రాటజీస్ ఆఫ్ కొండగట్టు హిల్ ఫారెస్ట్, తెలంగాణ, ఇండియా." అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం బోటని విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.విజయ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పలు పరిశోధనా పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ పొందిన శీలం రామారావును యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్

జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన ఆవరణలో తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షనర్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ 17న పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటారని అన్నారు. కాని ఒకరోజు ముందే మన జిల్లాలో ఈ దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని అన్నారు. 1982లో డిసెంబర్ 17న పదవీ విరమణ పొందిన అధికారులు, పెన్షనర్‌లకు గౌరవ, మర్యాదలకు హామీ ఇస్తూ సుప్రీం కోర్టు కీలకమైన తీర్పుని వెలువరించిందని అన్నారు. ఈ తీర్పు ద్వారా సమాజానికి గౌరవం తీసుకురావడానికి సంవత్సరాలుగా పోరాడిన స్వర్గీయ డీఎస్ స్వరూప్ నకరాను కృతజ్ఞతతో స్మరించుకోవడానికి పెన్షనర్స్ డేను నిర్వహించుకుంటామన్నారు. ఫిబ్రవరి నెల ఆఖరు లోపు పెన్షనర్‌లు లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించాలని సూచించారు. నావంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందూలాల్ శ్రీవాత్సవ, డీటీఓ డాక్టర్ ప్రభాకర్, ఆర్డీఓ రత్న కళ్యాణి, డీపీఆర్వో తిరుమల, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనాధికార విద్యుత్ మోటార్ల కనెక్షన్లు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం



రైతులు అనాధికార విద్యుత్ మోటార్ల కనెక్షన్‌లను విద్యుత్‌శాఖలో నమోదు చేసుకోవాలని ఏఈ సుమన్ కుమార్ తెలిపారు. శనివారం నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. అనధికార విద్యుత్ మోటార్ల కనెక్షన్ వెంటనే విద్యుత్ సంస్థలో నమోదు చేయించుకోవాలని అన్నారు. విద్యుత్ సర్వీస్ కనెక్షన్, విద్యుత్ మీటర్ లేని గ్రామ పంచాయతీ ఆఫీసులు, ఉద్యానవనాలు, ఆధ్యాత్మిక ఆలయాలు, ఏండ్ల తరబడి ఉన్న బకాయిల కనెక్షన్లు, రికార్డుల్లో లేని అనధికార విద్యుత్ మోటారు కనెక్షన్లు వెంటనే విద్యుత్ సంస్థలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని చెప్పారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, వ్యవసాయ మోటార్ల విద్యుత్ కస్టమర్ ఛార్జీలు చెల్లించకపోవడం, కారణాల వల్ల విద్యుత్ సంస్థకు అపారమైన నష్టం వాటిల్లుతోందని తెలిపారు. కడెం మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు కనెక్షన్లు రెగ్యులరైజ్ చేసుకొని విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-రెబ్బెన

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘం ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని గోలేటి బ్రాంచ్ ఇన్‌చార్జి ఇప్ప నర్సయ్య అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని ఏరియా వర్క్‌షాపులో స్టోర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గోలేటి బ్రాంచ్ ఇన్‌చార్జి ఇప్ప నర్సయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ, సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు పోరాడే ఏఐటీయూసీ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. సింగరేణిలో మొన్నటిదాకా బీఆర్ఎస్ అనుబంధ యూనియన్ టీబీజీకేఎస్ మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మళ్లీ ఇప్పుడు అదేవిధంగా రాజకీయ జోక్యంతో సంస్థను ఆర్థికంగా దోపిడి చేయాలని కాంగ్రెస్ అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీ ప్రయత్నం చేస్తుందన్నారు. నిన్న, మొన్నటి వరకు కార్మిక సమస్యలు ఏమాత్రం పట్టించుకోని కొన్ని యూనియన్లు కార్మికులకు మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని అన్నారు. కార్మికులకు సొంతంటి పథకం అలవెన్సులపై ఐటీ రిటర్న్ కంపెనీ చెల్లించే విధంగా ఏర్పాటు తదితర 48 డిమాండ్లతో మెనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు ఏఐటీయూసీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎళ్లవేళల కార్మికుల పక్షాన ఉంటూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్న ఏఐటీయూసీ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్మికులందరూ కూడా తప్పకుండా ఏఐటీయూసీ చుక్క గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భయ్యా మొగిళి, కార్యదర్శులు ఉయిక చంద్రశేఖర్, సముద్రాల ఆనంద్, ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి అశోక్, వర్క్‌షాప్ మాజీ ఫిట్ కార్యదర్శి నరసింహస్వామి, నాయకులు బక్క శంకర్, వేణు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటో నడిపితే కఠిన చర్యలు

బోథ్: మద్యం తాగి ఆటో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ భీమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకువెళ్లకూడదన్నారు. పరిమితికి మించి తీసుకువెళ్లినట్లయితే ప్రమాదాలు ఎక్కువ సంభవించే అవకాశాలు ఉంటాయని సూచించారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే ఆర్థికంగా మీరే నష్టపోతారని ఆటో డ్రైవర్లకు సూచించారు. చెడు అలవాట్లకు పోకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాము, ఆటో డ్రైవర్స్‌లు పాల్గొన్నారు.

21న ఎస్సీ వర్గీకరణ కోసం చలో ఢిల్లీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్‌తో ఈ నెల 21న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2014లో తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పటివరకు 10 సంవత్సరాలు పూర్తయినప్పటికీ వర్గీకరణపై మాట్లాడకపోవడం దారుణం అన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాలు ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మెన ధర్మయ్య, రాష్ట్ర కార్యదర్శి శనిగరం మల్లేష్, మండల నాయకులు చిలారి సుకుదేవ్, ఎగిరపు బాపు, విలాస్ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-జైపూర్



కరోనాతో బాధపడుతూ మృతి చెందిన ఇందారం-1ఏ గని కార్మికుడు గణవేణి నరసయ్య కుటుంబ సభ్యులకు శనివారం రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన నరయ్య ఇందారం-1ఏ గనిలో విధులు నిర్వరిస్తూ కరోనా పాజిటీవ్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు సంస్థ ద్వార మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కును నర్సయ్య భార్య గణవేని మానమ్మకు గని వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్‌పాషా, ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఎం. శ్రీనివాస్‌ల అందజేశారు.

కార్మికుల పక్షాన నిలబడి పోరాడే సంఘం హెచ్‌ఎంఎస్



నవతెలంగాణ-జైపూర్

టీబీజీకేఎస్‌తో పాటు జాతీయ కార్మిక సంఘాలలో నిజాయితీ గల కార్మిక సంఘం హెచ్‌ఎంఎస్ మాత్రమే. కార్మికుల పక్షాన నిలబడి పోరాడే కార్మిక సంఘం హెచ్‌ఎంఎస్ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ నీరటి రాజన్న అన్నారు. శనివారం ఇందారం-1ఏ, ఓపెన్‌కాస్ట్ గని పిట్ కార్యదర్శి పెద్దన్న అధ్యక్షన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అవినీతి అధికారులకు వ్యతిరేకంగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన హెచ్‌ఎంఎస్ నాయకులు నిర్బంధాలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మిగితా సంఘాల నాయకులు కార్మిక హక్కులు తాకట్టుపెట్టి సంస్థను రూ. వంద కోట్ల కుంభకోణాలకు పాల్పడటం, అవినీతి అధికారులకు అండగా నిలబడ్డారని ఆరోపించారు. మెడికల్ అన్‌ఫిట్ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ఆఫీసుల పేరిట ఫక్షన్‌హాల్స్ నిర్మించుకుని అనేక అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ఆరోపించారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, విప్లవ కార్మిక సంఘాలు నిజాయితీగా కార్మికుల ఏజెండానే తమ ఏజెండాగా పని చేస్తున్న హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘానికి కార్మికులు మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంబాల నర్సయ్య, దుర్గం లక్ష్మణ్, ఎస్‌కే వలీ, విజయ బాబు, దుర్గం వెంకటేశ్వర్లు, పల్లె క్రాంతి కుమార్, జైపాల్ సింగ్ పాల్గొన్నారు.

భవిష్యత్ లక్ష్యంతో ఇష్టపడి చదువుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

భవిష్యత్తును ఉన్నతంగా నిర్మించుకోవడం కోసం లక్ష్యంతో ఇష్టపడి చదువుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులతో మండల స్థాయి అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వార ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవి లక్ష్మన్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో స్థానిక ఎంపీటీసీ లింగస్వామి, సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ రాజమల్లు, మెడికల్ ఆఫీసర్ సింధూర, ఎస్సై నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, ఎంపీఈఓ అనిల్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు విద్యార్థులతో భవిష్యత్ కార్యాచరణపై తమ సలహాలు, సూచనలు, అనుభవాలను పంచుకున్నారు.

నేటి నుంచి ఈజ్‌గాం బోనాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ ప్రాంగణంలో బోనాల జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తా తెలిపారు. నేటి నుంచి నాలుగు ఆదివారాలు, ఐదు బుధవారాల్లో భక్తులు మల్లన్న దేవునికి బోనాలు సమర్పిస్తారన్నారు. ఆదివారాల్లో సుమారు పది వేల మంది, బుధవారాల్లో సుమారు ఐదు వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించామని తెలిపారు. తగు జాగ్రత్తలతో భక్తులు బోనాల కార్యక్రమ విజయవంతానికి సహకరించాలని ఈఓ కోరారు.

బీఎస్పీ నాయకుడి మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రానికి చెందిన బీఎస్పీ నాయకుడు రత్నం బహుజీ గుండెపోటుతో శుక్రవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతికాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్పీ అధైర్య పడవద్దని అండగా మేము ఉంటామని మనోధైర్యాన్ని నింపింది.

18న కాగజ్‌నగర్‌లో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మెడిప్లస్ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగాల ఎంపిక కోసం ఈ నెల 18వ తేదీన కాగజ్‌నగర్ పట్టణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 220 పోస్టులలో ఫార్మసిస్టు 40 సీఏస్సీ 50 జూనియర్ అసిస్టెంట్ 100 ఆడిటర్ అసిస్టెంట్ 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి కలవారు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు హాజరుకావాలని ఇతర వివరాల కోసం 9908187894, 9440514962 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు జిల్లా స్థాయి జూనియర్ నెట్ బాల్ సెలక్షన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో నేడు అనగా ఆదివారం జిల్లా స్థాయి జూనియర్ నెట్ బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలిబిన్ హైమద్, జిల్లా సెక్రెటరీ బి.తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికకు వచ్చేవారు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు కళాశాలలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. పాల్గొనేవారు కోచులు హరీష్, ఏడుకొండలు, అర్చనకుమారికి రిపోర్టు చేయాలని, మరిన్ని వివరాలకు 9949300668 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గర్భిణీకి ఆశ్రయం ఇచ్చిన సఖీ సెంటర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎటువంటి ఆసరా లేని గర్భిణికి జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ నిర్వాహకులు ఆశ్రయం ఇచ్చారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండలం బెండర గ్రామానికి చెందిన గర్భిణీ మహిళ ఆసరా లేక ఇబ్బందులు పడుతున్నారని అక్కడి మాజీ ఎంపీటీసీ హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేశారని తెలిపారు. వెంటనే స్పందించి అక్కడికి వెళ్లి మహిళను తీసుకువచ్చి స్వధార్ సెంటర్లో ఆశ్రయం ఇచ్చినట్టు తెలిపారు. ఇటువంటి వాటికి సంబంధించి ప్రజలు సమాచారం అందించాలని సఖి సెంటర్ పూర్తిస్థాయి ఆశ్రయం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సఖి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిమెట్టు అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- నోడల్ అధికారి ఆడే ప్రకాష్



నవతెలంగాణ-కెరమెరి

ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు అమలు, లక్ష్యసాధనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఝరి ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ విషయాల మాదిరి పాఠ్య బోధనను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలిమెట్టు అమలులో ఇంకా చాలా పాఠశాలల్లో అనుకున్న లక్ష్యానికి దూరంగా ఉన్నామని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించే సమయంలో పాఠ్యపుస్తకం, కరదీపిక, అభ్యాస పుస్తకం మూడింటిని మేళవింపు చేసుకొని పాఠ్య బోధన చేయాలని సూచించారు. బోధనభ్యసన సామగ్రిని వినియోగిస్తూ, బోధన సమర్థవంతంగా ఉండాలని చెప్పారు. ప్రతి రోజు పాఠ్య బోధన అయ్యాక ఆ రోజు చెప్పిన అంశాన్ని అభ్యాస పుస్తకాలలో చేయించాలని, కనీసం 80 శాతం మంది విద్యార్థులు ప్రగతి సాదించాకే తర్వాతి బోధన అంశానికి వెళ్లాలని సూచించారు. పాఠశాలల్లో నిర్వహించే రికార్డులు, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం క్లస్టర్ నోడల్ అధికారి భరత్ రావ్, మాట్లాడుతూ పాఠశాలల్లో వెళ్లి పరిశీలిస్తున్నప్పుడు తొలిమెట్టు అమలులో ఇంకా కొన్ని లోపాలు ఉన్నాయని అన్నిటినీ సవరించుకొని విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరారు. మన మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఝరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రుక్సానా బేగం, మండల రిసోర్సు పర్సన్లు నరేష్, కృష్ణమూర్తి, ప్రత్యుష పాల్గొన్నారు.

ఓటరు సవరణను సమర్థవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20 నుండి ఫిబ్రవరి 8 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2024 వరకు 1 జనవరి 2024ను అర్హత తేదీగా నిర్ధారించడం జరిగిందని, ఈ క్రమంలో ప్రీ-రివిజన్ యాక్టివిటీ ఈ నెల 20 నుండి 5 జనవరి వరకు, రివిజన్ యాక్టివిటీ జనవరి 6 నుండి 8వ తేదీగా విభజించడం జరిగిందని తెలిపారు. ప్రీ-రివిజన్ యాక్టివిటీలో భాగంగా ఈ నెల 20 నుండి జనవరి 5వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల పునఃవ్యవస్థీకరణ, ఎలక్టోరల్ రోల్ వ్యత్యాసాల తొలగింపు, ఫొటో ఓటరు జాబితాలో ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సెక్షన్స్, పార్ట్స్ పున:నిర్మాణం, పోలింగ్ కేంద్రాల ప్రదేశాల ఖరారుతో పాటు అనుమతులు పొందుట, 1 నుండి 8 ఫారములు, ముసాయిదా జాబితా తయారుకు చర్యలుంటాయన్నారు. రివిజన్ యాక్టివిటీస్లో భాగంగా జనవరి 6న ముసాయిదా జాబితా ప్రచురణ, 6 నుండి 22వ తేదీ వరకు ముసాయిదాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరిస్తామన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించి, 6న పారామీటర్లు పరిశీలించి తుది జాబితా ప్రచురణ కొరకు ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని 8న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా తయారు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత గల ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాహుల్, మంచిర్యాల, చెన్నూర్ ఆర్డీఓలు రాములు, సిడాం దత్తు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్, ఫర్టిలైజర్స్ జాయింట్ సెక్రటరీ మనోజ్ శత్తి



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహించడం జరుగుతుందని మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ జాయింట్ సెక్రటరీ మనోజ్ శత్తి అన్నారు. శనివారం జిల్లాలో సంకల్ప్ యాత్ర ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం, హాజీపూర్ మండలం వేంపల్లి, భీమారం మండలం పోలంపల్లి, మందమర్రి మండలం బొక్కలగుట్టలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 311 గ్రామపంచాయతీలలో కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఇప్పటి వరకు లబ్ధిపొందని అర్హులైన వారు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైఫ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రజలకు అర్థమయ్యే విధంగా ప్రచారం చేయాలన్నారు. 26 జనవరి వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంపై ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులపై చికిత్స అందించడంతో పాటు నూతన గ్యాస్ కనెక్షన్లను నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎల్‌డీఎం తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జీసీ. సుబ్బారాయుడు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ నరేందర్, కృషి విజ్ఞాన్ కేంద్ర సమన్వయకర్త, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

- నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం అప్పగింత
- అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పేదరికం కారణంగా పిల్లలను చదువుకు దూరం చేయవద్దని, వారిని చదివిస్తేనే అభివృద్ధి సాధ్యమని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోనే అత్యంత మారుమూల గిరిజన గ్రామమైన మాణిక్ పటార్‌లో పక్కా భవనం లేకపోవడంతో స్పందించిన అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఒకప్పుడు తడకల షెడ్డులో కొనసాగిన మాణిక్ పటార్ పాఠశాలకు ఎన్నికల పుణ్యంతో పక్కా భవనం లభించింది. పాఠశాలకు, పోలింగ్ కేంద్రానికి నిర్మించిన నూతన భవనాన్ని శనివారం ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పేద కుటుంబాలు ఎలాంటి ఖర్చు లేకుండా పిల్లలను చదివించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, పిల్లలను బడికి పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. చదువుతోనే విజ్ఞానం పెరుగుతుందన్నారు. రాబోయే జనవరి 1 లోపు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకుని ఓటరుగా గుర్తింపు పొందాలన్నారు. రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలోనే అత్యంత మారుమూల గిరిజన గ్రామమైన మాణికపటార్‌కు కనీస రోడ్డు రవాణా లేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించేలా చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్ బాబు, మన ఊరు మన బడి పథకం కోఆర్డినేటర్ భరత్, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, ఎంపీఓ గౌరీశంకర్, మండల నోడల్ అధికారి దేవాజీ, ప్రధానోపాధ్యాయులు సంధ్య, ప్రేమలత, సీఆర్పీ కైలాసం, పంచాయతీ కార్యదర్శి బాబురావు, మాలిని, సర్పంచ్ భగవంతరావు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీఎస్‌యూటీఎఫ్ కాగజ్‌నగర్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి తెలిపారు. అధ్యక్షులుగా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా పుల్లూరు బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా నరేష్ కుమార్, వర్ణ, కోశాధికారిగా దుర్గం శివానంద్, కార్యదర్శులుగా లలిత, వినోద్, కరిష్మా, హారిక, ఆనంద్ కుమార్, ఫర్వీన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నయీమ్, మహిళా కమిటీ కన్వీనర్‌గా శ్రీదేవి, కో-కన్వీనర్‌గా రమ, స్రవంతి, రజితలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ అగ్రాభాగాన నిలుస్తుందన్నారు. 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ప్రమోషన్లు బదిలీలు చేపట్టే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని, కేజీబీవీ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, గెస్ట్ పార్ట్ టైం టీచర్లందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన మండల కమిటీకి అభినందనలు తెలిపారు.

ధనోర ప్లాంట్‌ను సందర్శించిన ఎఎల్ఓ అమీరున్నీసా



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ధనోర ఫిల్టర్ బెడ్‌ను కాగజ్‌నగర్ ఏఎల్ ఓ అమీరున్నీసా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్ వివిధవిభాగాల్లో పని చేస్తున్న మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మికుల పక్షాన ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య కార్మికుల సమస్యలను సదరు అధికారికి విన్నవించారు. గత సమ్మె కాలపు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నాలుగు నెలల పాటు పనిచేసినప్పటికీ కేవలం ఒకే నెలకు సంబంధించిన వేతనాలు చెల్లిస్తూ మూడు నెలలకు సంబంధించిన వేతనాలను ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. లేబర్ అధికారులు భవిష్యత్తులో ఇచ్చిన మాట నిలబెట్టు కోక పోతే మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కంపెనీ యాజమాన్యంపై లేబర్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ, పోరాడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు సంతోష్, శఫరుద్దీన్, మహబూబ్, మొండయ్య, వసంత్, రాజన్న, ప్రశాంత్, విజయ్, సాజన్ పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు..పూడ్చడం మరిచారు



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో సర్వీస్ రోడ్డుపై కల్వర్టు నిర్మాణం కోసం గుంతలు తవ్వి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మత్తులు చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో అయితే నడిచి వెళ్లాలంటే ఎక్కడ గుంతలో పడిపోతామేమోనని బయపడుతూ వెళ్లాల్సి వస్తుంది. తవ్విన గుంతలో నీరు నిలిచి ఉండడంతో కాలినడకన వెళ్లే వృద్ధులు గుంతలో పడే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఐ అధికారులు స్పందించి త్రవ్విన గుంతలను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు. వేరే దారి లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపుల వాహనాలను నిలిపి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవోపేతంగా అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య గర్భగుడి నుంచి తీసుకువచ్చిన పూజిత అక్షింతల శోభాయాత్ర శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో వైభవోపేతంగా సాగింది. భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో త్రినేత్ర శివాలయం నుంచి హనుమాన్ మందిర్ వరకు ఈ శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. మహిళలు మంగళ హారతులతో, మేళ తాళాలతో, యువకుల నత్యాలతో, జయ్ శ్రీరామ్ నామ స్మరణలతో పట్టణ పుర వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. మేయిన్ మార్కెట్‌లో వ్యాపారస్తులు పల్లకిపై పుష్పాలు చల్లి, హరతులు ఇచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హనుమాన్ ఆలయం చేరుకున్న పూజిత అక్షితలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం శోభా యాత్రలో పాల్గొన్న భక్తులకు పులిహోర, బూంది ప్రసాదమును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన పుర ప్రముఖులకు, పట్టణవాసులకు, మహిళలకు, రామ భక్తులకు భజరంగ్ దళ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ సెక్రెటరీ మనోజ్ శెట్టి అన్నారు. శనివారం ఇందారం గ్రామపంచాతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోరి ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి భీమా తదితర పథకాలకు సంబంధించిన శాఖల అధికారులు పంచాయతీ ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల లబ్ధిదారుల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నరేందర్, డీఆర్‌డీఓ శేషాద్రి, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ సుబ్బారాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ నిర్మల, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్ కుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, సర్పంచ్ గడ్డం మంజుల ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టుదలతో పేదరికాన్ని అధిగమించాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు పట్టుదలతో పేదరికాన్ని అదిగమించాలని తాండూర్ ఎస్సై రాజశేఖర్, తహసీల్దార్ రోహిత్ అన్నారు. శనివారం తాండూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని కలలను సహకారం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు లక్ష్యం కోసం కలలు కనలని కలలు సాకారం కావాలంటే పట్టుదలతో చదవాలని సూచించారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో కూడిన విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సౌకర్యాలను అందిపుచ్చుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల సంతృప్తి వ్యక్తిగత గుర్తింపు కోసం కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉప్పుట్ల మల్లేశ్వరి, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జీ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం ఈనెల 30న లక్షెట్టిపేట మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు న్యాయవాదులు సహకరించాలని అన్నారు. లక్షెట్టిపేట కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉండి ఇరువైపులా పార్టీలు రాజీపడే అవకాశం ఉన్న కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. అంతకు ముందు కోర్టు శతదినోత్సవ వార్షికోత్సవాల్లో భాగంగా జడ్జితో పాటు సీనియర్ న్యాయవాది అక్కల శ్రీధర్ వివిధ చట్టాలపై జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన అడెల్లి ఎంపీటీసీ సవిత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి ఎంపీటీసీ సవిత చందు శనివారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీటీసీ సవిత మాట్లాడారు. అడెల్లి ప్రాదేశిక నియోజకవర్గం అభివృద్ధి కోసం బీజేపీలో చేరుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కరిపె విలాస్, నాయకులు చెన్న రాజేశ్వర్, కొరిపెల్లి రాజు, సామల వీరయ్య, గణపతి, కరుణసాగర్‌రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మణ్, రాథోడ్ రాజు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బెజ్జూర్ రేంజ్‌ను సందర్శించిన శిక్షణ బీట్ అధికారులు

నవతెలంగాణ-బెజ్జూరు

బెజ్జూరు రేంజ్ శిక్షణ బీట్ అధికారులు దూలపల్లి అకాడమీ ఆధ్వర్యంలో శనివారం అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో రేంజ్ పరిధిలో కృష్ణపెల్లి సెక్షన్ పరిధిలోని ఇందుర్గం బీట్‌లోని రాముడు, బీముడు టేకు చెట్టు, సమ్మక్క, సారలమ్మ గద్దె మైదానాలను సందర్శించారు. తీసుకుంటున్న చర్యలను శిక్షణ అధికారులకు వివరించారు. ఆయన వెంట బెజ్జూరు డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్, బీట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చూసే బాధ్యత మనమీద ఉండాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. శనివారం కుభీర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. అందులో భాగంగా ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బంది పవర్ యూనిఫామ్ మెంటనెన్స్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న అన్ని ప్రదేశాలను పరిశీలించారు. ఇప్పటి వరకు స్టేషన్‌లో నమోదైన పలు రకాల కేసులపై ఎస్సై షరీఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలకు ముందుగా పోలీసులు అంటే భయం ఉండకుండా వారితో స్నేహ భావం పెంచుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా వారికి పోలీసులు ఉన్నారన్న నమ్మకం కలిగేలా చూడాలన్నారు. దీంతో పాటు ముఖ్యంగా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేలా చూడాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఆయన భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై షరీఫ్‌ను అభినందించారు.

సర్వీసింగ్ సెంటర్లలో మగ్గుతున్న బాల్యం

- ఓ పక్క బడి బయట పిల్లల సర్వే
- జిల్లా కేంద్రంలోనే పదుల సంఖ్యలో బాలకార్మికులు
- చూసీచూడనట్లు సంబంధిత అధికారులు



నవతెలంగాణ - హాజీపూర్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లల్లో ఖర్చు చేస్తూ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యాయి. ఈ నెల 11 నుంచి గ్రామాల్లో, పట్టణాల్లో బడి బయట పిల్లల సర్వే రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. జనవరి 10 వరకు బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనే ఈ సర్వే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సీర్పీల ఆధ్వర్యంలో 6 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి విద్యాశాఖ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

సర్వే నామమాత్రమేనా..?

ఓ పక్క అధికారులు సర్వే చేస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నారు. మరో పక్క పదుల సంఖ్యలో బడీడు పిల్లలు సర్వీసింగ్ సెంటర్లు,మెకానిక్ షాప్‌లు, ఇటుకల బట్టీల్లో పనులు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కార్ వాష్ సెంటర్‌లో బాల కార్మికులే కార్లను కడుగుతున్నారు. అక్కడ ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్లను కడిగిస్తుంటారు. గమనించిన కానీ మాకెందుకులే అన్నట్లు చూసీ చూడనట్లు వెళ్లిపోతున్నారు. ఇక హాజీపూర్ మండలంలో 60 వరకు ఇటుక బట్టీలు వున్నాయి. అందులో వెయ్యి మందికి పైగా కార్మికులు పనిచేస్తారు. వారి పిల్లలు బడులకు పోకుండా తల్లి తండ్రుల వెంటే పనులు చేస్తున్నారు. గతంలో పోలీస్ శాఖ అధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు చేపట్టి బాల కార్మికులను బడులకు పంపే కార్యక్రమాలు చేపట్టే వారు. కానీ రెండేళ్లుగా పోలీస్‌లు ఆ పక్క చూడడం లేదు. ఇటుక బట్టీల నిర్వాహకులు బట్టికింత అని వసూలు చేస్తూ లక్షల్లో అధికారులకు ముట్టజెప్పడం తోనే సంబంధిత శాఖల వారు అటు వైపు పోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అధికారులు స్పందించి బడీడు పిల్లలను బడులకు పంపే ఏర్పాట్లు చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

పెర్క్‌పై ఇన్‌కం ట్యాక్స్‌ను యాజమాన్యంతో చెల్లింపజేస్తాం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే పెర్క్ పై ఇన్కమ్ టాక్స్‌ను యాజమాన్యంతో చెల్లింప చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్సీడబ్ల్యూయూ-ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్ షాప్, సీహెచ్‌పీలలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదాతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్మికుడికి 250 గజాలతో పాటు వడ్డీ లేని రూ.20 లక్షల రుణాన్ని ఇప్పిస్తామన్నారు. గత గుర్తింపు సంఘం నిర్లక్ష్యం వల్ల సింగరేణిలో పెరిగిపోయిన కాంట్రాక్టీకరణను అడ్డుకుంటామని, నూతన అండర్ గ్రౌండ్ గనులను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, సింగరేణి స్కూల్స్‌లో కార్మిక పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్ ద్వారా నాణ్యమైన విద్యను అందించుటకు కృషి చేస్తామన్నారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన టీబీజీకేఎస్ చేతకానితనం వల్ల సింగరేణిలో కాంట్రాక్టీకరణ పెరిగి సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గతంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఓడిపోయిన ప్రతిక్షణం కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పైన పోరాటాలు నిర్వహించిందన్నారు. కొన్ని సర్కారు సంఘాలు ఈ 11 సంవత్సరాలలో ఏ ఒక్కరోజు కూడా కార్మికుల సమస్యలపై స్పందించని నాయకులు రాష్ట్ర ప్రభుత్వంలో మార్పు రావడం వల్ల మళ్లీ కార్మికులను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. గత గుర్తింపు సంఘంలో పనిచేసిన నాయకులు ఈరోజు కండువాలు మార్చుకొని మళ్లీ కార్మికులను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. కాబట్టి విజ్ఞులైనటువంటి కార్మిక వర్గం ప్రతిక్షణం కార్మిక సమస్యలపైన స్పందించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించే ఏఐటీయూసీని ఆదరించడం ద్వారా కార్మికుల అపరిశుకృత సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఈ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించాలన్నారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా వర్క్ షాప్‌లోని మహిళా కార్మిక సోదరీమణులు, కార్మికులు 80 మంది ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శులు మల్లేష్, మారుపల్లి సారయ్య, అఫ్రోజ్ ఖాన్, గొల్లపల్లి రామచందర్, పిట్ కార్యదర్శులు సదానందం, మురళి చౌదరి, గునిగంటి నర్సింగ్ రావు, మోహన్‌రెడ్డి, బ్రాంచ్ నాయకులు యాదగిరి విజయరామరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పాటు క్రీడా స్ఫూర్తి ఉండాలి

నవతెలంగాణ-మందమర్రి

పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో పాటు క్రీడా స్ఫూర్తి ని కలిగి ఉండాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం సర్కిల్ పరిధిలోని సిబ్బందితో సీఐ మహేందర్‌రెడ్డి వారాంతపు పరేడ్ నిర్వహించారు. పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన సందర్భంగా సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య తరుపున సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత క్రమశిక్షణ కలిగి, సమాజంలో అసాంఘిక చర్యలు జరగకుండా, ధైర్యంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. సిబ్బంది అందరూ విధిగా రోజులో ఏదో ఒక సమయం చూసుకొని ఏదో ఒక ఆట తప్పనిసరిగా ఆడటం వలన అలసత్వం తొలగి మానసికంగా ఉల్లాసంగా ఉంటారని శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటారని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ అదనపు ఎస్సై తానాజి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలి

నవతెలంగాణ-మందమర్రి

ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని మందమర్రి జీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో శనివారం 3వ ఉమ్మడి ఆదిలాబాద్ హ్యాండ్ బాల్ స్కూల్ లీగ్ 2023 అండర్-17 పోటీలకు ఏరియా జీఎం మనోహర్, పీఎం శ్యాంసుందర్, సీఐ మహేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా శరీరాన్ని దృఢంగా ఉంచడానికి సహాయపడుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, హ్యాండ్ బాల్ స్టేట్ ప్రెసిడెంట్ గోనె శ్యాంసుందర్ రావు, అసోసియేషన్ సెక్రెటరీ కనపర్తి రమేష్, అసోసియేషన్ మెంబర్స్, బాలికల జట్లు 15, బాలురు జట్లు10 మొత్తం 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కూలీని కట్టేసి కొట్టిన వ్యాపారి

నవతెలంగాణ-హాజీపూర్

మానవత్వం మరిచి కూలీని పశువులా కట్టేసి కొట్టిన ఘటన మంచిర్యాల కూరగాయల మార్కెట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల కూరగాయల మార్కెట్‌లో జాడి గంగులు అనే దళిత కూలీ టమాటా వ్యాన్‌లో డ్రైవర్ కు హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. వ్యాన్ లోని టమాటాలు అమ్ముకున్నడనే నెపంతో కూరగాయల వ్యాపారి బసవన్న కష్ణ (బి.కె)తో అతని కుమారులు అహంకారంతో అందరూ చూస్తుండగా మంచిర్యాల మార్కెట్‌లో జాడి గంగులును కట్టేసి కొట్టడమే కాకుండా దుర్భశలాడుతు నాన ఇబ్బంది పెట్టారని నేతకాని మహర్ సంఘం నాయకులు తెలిపారు. ఈ ఘటనను కొత్తపెల్లి గణేష్ చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసు సంఘటన స్థలానికి రావడంతో జాడి గంగులు ఊపిరి పీల్చుకున్నాడు. వ్యాపారిపై కేసు నమోదు చేశారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడటమే కాకుండా జాడి గంగులు కుటుంబానికి ప్రభుత్వం నుండి తక్షణ సాయం అందించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపాలనీ, ఈ అగాయిత్యానికి పాల్పడిన వారిని, సహకరించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి గంగేష్, దుర్గం సిద్దార్థ రాంమ్మూర్తిలు పేర్కొన్నారు.

ఏఐటీయూసీని గెలిపించాలి



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య పిలుపునిచ్చారు. శనివారం కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ ముస్కే సమ్మయ్య హాజరై మాట్లాడారు. ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను గెలిపించాలని పిలుపు నిచ్చారు. సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల కంపెనీ రూ.29 వేల కోట్ల అప్పులో ఉందని, దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు సంఘం, యాజమాన్యమే వహించాలని, గత పది సంవత్సరాలుగా టీబీజీకేఎస్ నాయకులు యాజమాన్యానికి కార్మిక హక్కులను తాకట్టు పెట్టడం వల్ల, మాట్లాడే వారే కరువైపోయరని, ప్రతి పనికి లంచాల రూపంలో కార్మికులకు అనేక నష్టాలు జరిగయని, సొంతింటి కల నెరవేరాలని, నూతన బొగ్గు బావులు రావాలని మేనిఫెస్టోలు అనేక విషయాలు పొందుపరచడం జరిగిందని, కార్మికుల కోసం పని చేస్తున్న ఏఐటీయూసీ చుక్క గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, సుభాష్ చంద్రబోస్, మైనుద్దీన్, బొద్దుల వెంకటేష్, దేవులపల్లి శ్రీనివాస్, నీలయ్య, రాజ్ కొమురయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలో కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్

కాసిపేట : మండల కేంద్రంలో కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 9,10వ తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని పిల్లలు కళలు కన్న మార్గంలో ఎలా ముందుకు సాగాలో అనే అంశాలపై అవగాహన సదస్సు అధికారులు తమ తమ మార్గ దర్శకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, కాసిపేట ఎస్సై గంగారాం, హెచ్ఎం జీవరత్నం, వైద్యాధికారులు, ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న మినీ జాబ్ మేళా

నస్పూర్ : జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో 19న మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో రిలయన్స్ జియో ఇన్ఫా లిమిటెడ్ సంస్థలో తెలంగాణ వ్యాప్తంగా పని చేసేందుకు జియో ఫైబర్ ఇంజనీర్, ఇన్‌స్టాలేషన్ ఇంజనీర్, జియో ఫైబర్ అసోసియేట్, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులలో నియామకం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ నుండి డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9111731173, 6304600392, 9391302351లలో సంప్రదించాలన్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసిన మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును హైదరాబాద్‌లో శనివారం జన్నారం మాజీ జడ్పీటీసీ లావుడియా బక్షినాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ బక్షినాయక్ నూతన ఎమ్మెల్యే బొజ్జుకు పలు సూచనలు చేశారు. జన్నారం మండలం 3 జిల్లాలకు మధ్యగా ఉందని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఐటీఐ కళాశాలకు సొంత భవనం 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, జన్నారంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. అందుకోసం ప్రత్యేక నిధులు తెచ్చి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

మండలంలో వ్యాధి నిరోధక టీకాలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ఏడు సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాలలో శనివారం వాక్సినేషన్ ప్రక్రియ చేపట్టినట్లు వైద్యాధికారి కుమారస్వామి తెలిపారు. వాక్సినేషన్ ప్రక్రియలో ఏఎన్ఎంలు నవిత, పద్మ కవిత దేవి, అనసూయ, పారిజాతం, పుష్పలత, తులసి, పుష్ప, శ్రీలత, ఆశా కార్యకర్తలు లక్ష్మీ మల్లేశ్వరి పుష్పలత స్రవంతి శ్రీలత సునీత మల్లేశ్వరి పాల్గొని వ్యాధినిరోధక టీకాలను వేసినట్లు తెలిపారు. గోపాల్‌నగర్ పంచాయతీలోని వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత పంచాయతీ కార్యదర్శి వసంత ఆశ కార్యకర్త స్వప్న అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎర్ర సంపత్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద శనివారం 2 ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్లపై వెళ్తున్న ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన చిన్నారులను స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తహసీల్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి వెంటనే రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎం.లలిత కుమారి తెలిపారు. ఈ నెల 15వ తేదీన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-14, 17 చదరంగం పోటీలలో ముగ్గురు విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి ఈ నెల 17 ,18, 19 తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు అండర్-14 విభాగంలో డి.శ్రీహర్షిని, అండర్-17 విభాగంలో జై రాజహంస, జై మల్లేశ్వరి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఈ క్రీడాకారులను వైస్ ప్రిన్సిపల్ కే.మహేశ్వరరావు, పీడీ, పిటి మల్లికా, మమత, మంచిర్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పరిమళ, హౌజ్ పేరెంట్స్, రజితదేవి, ఉమాదేవి, భవాని అభినందించారు.

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదువులో రాణించాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదువులో రాణించాలని ఎంఈఓ విజయ్ కుమార్, ఎఫ్ఆర్ఓ ఆఫీస్‌ఉద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాయ్స్ జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుకు పేద ధనికా తేడా లేదన్నారు. కష్టపడి చదివి గ్రామానికి తల్లిదండ్రులకు విద్యార్థులు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణాని పాల్గొన్నారు.

రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వాతావరణ పరిస్థితులతో ఈ సంవత్సరం పత్తి పంట దిగుబడి భారీగా తగ్గిన నేపథ్యంలో పంట కొనుగోళ్లలో రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించి అండగా నిలవాలని మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అన్నదాతలకు ప్రభుత్వం మద్దతుగా నిలవాలని కోరారు. పంట సాగుకు ఈ సంవత్సరం అనుకూల పరిస్థితులు లేకపోవడంతో దిగుబడి తగ్గిందన్నారు. సీసీఐ ద్వార కేవలం అరవై వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారని, ప్రభుత్వ మద్దతు ధర అందకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే రైతులకు న్యాయం చేసే దిశగా చూడాలని, అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ తరపున వారికి అండగా నిలబడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు కుమ్రరాజు, సురేష్, లింగన్న, సెడ్మాకి రాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆన్‌లైన్ పంట బుకింగ్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య సూచించారు. శనివారం మండలంలోని తంతోలి గ్రామంలో పంట బుకింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పంట క్షేత్రల్లో పర్యటించి శనగ పంటల వివరాలను తెలుసుకుంటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల్లో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. పంటలను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు రావని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆశ్రఫ్ అహ్మద్, నరేష్, రవి, ప్రసాద్, శివ, చరణ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్, పక్కన ఎస్పీ ఉదయ్ కుమార్, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. 2023 సంవత్సరంలో 47 కేసులకు గాను 17 కేసులు పెండింగ్, ట్రయల్‌లో 25 కేసులు విచారణలో ఉన్నాయని, 5 కేసులు పూర్తి అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ. 24 లక్షల 12 వేల 500 బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. కేసుల పరిష్కారానికి, బాధితులకు పరిహారం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న న్యాయసేవలు, పరిహారంపై నివేదికను అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై వివరంగా సమీక్షించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సాగు చేసే రైతులకు రైతు బంధు, ఇతర ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తామన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి సాగు, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తూ, ప్రభుత్వ పథకాలైన రైతుబంధు లాంటివి రాకుండా చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలలో ప్రత్యేకంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత, ఇతరులకు డిఅడిక్షన్ సెంటర్ ద్వారా నయం చేసే అవకాశం ఉన్నందున వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి స్మగ్లర్లపై పిడి యాక్ట్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గంజాయి విక్రయదారులను, పండించే వారిని నియంత్రిస్తున్నట్లు వివరించారు. గత సంవత్సరం 27 కేసులలో 64 వ్యక్తులపై గంజాయి కేసులను నమోదు చేసి వారి వద్ద నుండి రూ. 67,64,793 విలువచేసే 291 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే గంజాయి నిర్మూలన సాధ్యమన్నారు. గంజాయిపై సమాచారాన్ని పోలీసు యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. గంజాయి అలవాటు ఉన్న వ్యక్తులకు మొదట కౌన్సిలింగ్ ద్వారా నియంత్రణ చేపడుతున్నట్లు, విధిగా మారనప్పుడు కేసులను సైతం నమోదు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులకు సైతం కౌన్సిలింగ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలలో జిల్లా వ్యాప్తంగా గంజాయి పండిస్తున్న 38 వ్యక్తులను అరెస్టు చేసి 20 కేసులను నమోదు చేస్తూ 133 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు, 275 గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు వివరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా నియంత్రించడం, మత్తు పదార్థాలైన గంజాయి జిల్లాలో పండించకుండా చేయాల్సిన కార్యచరణను రూపొందించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం గంజాయి రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు స్రవంతి, జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీత, రాథోడ్ రమేష్, శంకర్, డీఎస్పీ ఉమేందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్, బేల మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్డీఓ స్రవంతికి వినతి పత్రం అందించి కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనథ్, బేల మండలాల నుంచి ఆధార్ అప్‌డెట్ కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని కోరారు. ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్స్‌కు ఈ-కేవైసీ అప్డేట్ కోసం అనేక అవస్థలు ఎదురవుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు యువజన కాంగ్రెస్ బోథ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ పోతారెడ్డి, యువజన కాంగ్రెస్ బేల మండల వైస్ ప్రెసిడెంట్ విపిన్ ఠాక్రే ఉన్నారు.

క్రీడలకు కేంద్రం ప్రభుత్వ ప్రోత్సాహం

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం క్రీడాలకు ప్రోత్సహం అందిస్తుందని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకుంటూ వారు ఎంచుకున్న క్రీడ రంగంలో రాణించాలని ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రైవేట్ స్కూల్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేడియంలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలని పీఈటీలు, కోచ్‌లు వినతిపత్రం అందించారు. అనంతరం వివిధ పోటీలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత క్రీడాలకు పెద్ద పీట వేశారన్నారు. దాని కారణంగా నేడు ఓలంపిక్‌సలో అనేక బంగారు పతకాలు వచ్చాయని తెలిపారు. క్రీడాలను ప్రోత్సహిస్తునే నిధులను కేటాయించారన్నారు. ప్రపంచ దేశాలతో సమానంగా ఓలంపిక్‌సలో క్రీడాకారులు మంచి ప్రతిభను చూపించారని, ఇది మోదీ వల్లనే సాధ్యమైందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో కూడా రాణించాలన్నారు. నిత్యం యోగ, క్రీడ సాధనలు చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సహపడకుండా గెలుపుకు మరింత కఠోర సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, స్వామి, కాంతారావ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ సోయం, కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపూరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో భారత్ సంకల్ప వికాసిత్ యాత్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను జిల్లాలో విస్తృత అవగాహన కల్పించి అమలు పరచాలన్నారు. జిల్లాలో 6 ప్రచార వాహనాలతో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13.5 కోట్లకుపైగా నీటి కుళాయి కనెక్షన్లు, 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.2.6 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు 4 కోట్ల పక్క ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ప్రధానమంత్రి ఉజ్వల యోజన క్రింద 10 కోట్ల గ్యాస్ కనెక్షన్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 2024 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, ప్రచార యాత్రను ఎంపీ, కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- సెడ్స్ మెడికల్ అధికారి డా. చంద్రకాంత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గిరి పల్లెల్లో సెడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సెడ్స్ మెడికల్ అధికారి డా. ఆరే చంద్రకాంత్ అన్నారు. శనివారం మండలంలోని సాలెగూడ, లొహార, ఎస్సీగూడ, మొలల్‌గుట్ట గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. ఆరే చంద్రకాంత్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల వృద్ధులకు ఉచిత వైద్య సేవలను సెడ్స్ స్వచ్ఛంద సంస్థ 8 సంవత్సరాలుగా నిరంతరంగా అందిస్తుందన్నారు. గ్రామీణ వృద్ధులు దూర భారం వలన ఆస్పత్రులకు వెళ్ళలేక పోవడాన్ని గమనించిన సెడ్స్ డైరెక్టర్ ఆర్ సురేందర్ కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ అనుమతితో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సవిత, ఆర్గనైజర్ సాయికుమార్, సిబ్బంది చౌహన్ సంతోష్ ఉన్నారు.

క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు



బ్యాటింగ్ చేసి క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

క్రీడాల ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని యువ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తితో పాటు సమయస్ఫూర్తి ఎంతో ప్రాధాన్యమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలో ప్రతి ఏటా నిర్వహించే ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ ఏర్పాటు చేయగా శనివారం ఆయన ప్రారంభించారు. ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి క్రీడాలను ప్రారంభించారు. సరదాగా క్రీడాకారులతో కలిసి బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ ఉత్సహపరిచారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో నిర్వహించే ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ ఎంతో ప్రాచుర్యం పొందిందాని, పొరుగు రాష్ట్రాల నుండి క్రీడాకారులు సైతం ఇందులో పాల్గొనడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడాలకు ఎంతో ప్రాధాన్యం కల్పించిందని, క్రికెట్ మైదానాలతో పాటు క్రీడా మైదానాలు, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించేలా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమైందన్నారు. జోగు ఫౌండేషన్ తరపున ప్రతి ఏటా గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేలా వారికి క్రీడా సామాగ్రిని సైతం అందించామన్నారు. క్రీడాకారులు తమ క్రీడాలను మెరుగుపరచుకొని జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయితోపాటు జాతీయస్థాయిలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్ వెంకన్న, అశోక్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సాజిదొద్దీన్, సాగర్, బుట్టి శివకుమార్, అతిక్, ఆశన్న పాల్గొన్నారు.

జాలం సింగ్ సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-నార్నూర్

జాలంసింగ్ చేసిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. జాలంసింగ్ 3వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాలంసింగ్ గొప్ప నాయకుడని ఆయన ఆశయసాధనకు కృషి చేస్తూ వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. అన్ని జాతిమతాల కోసం కృషి చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి నాయక్, వైస్ ఎంపీపీ చంద్ర శేఖర్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, నారాయణ్ నాయక్, పవార్ దేవిదాస్, రితేష్ రాథోడ్, బానోత్ సంతోష్, సురజ్ సింగ్, విశ్వనాథ్, రాణా ప్రతాప్, విజయ్ సింగ్, రన్వీర్ సింగ్, దత్తా రాథోడ్, బాలాజీ రాథోడ్, షేక్ అహ్మద్, బాబా ఖాన్, దాదే అలీ, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలనీ ఎంపీడీఓ చౌహాన్ రాధ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆటల పోటీలు శారీరకంగా, మానసికంగానూ ధృడంగా ఉండడానికి తోడ్పడతాయనీ, సరస్వతీ శిశు మందిరం ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటల పోటీలలో పాల్గొని శిశు మందిరాలకు బహుమతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలకు పాల్గొని విజేతలుగా నిలిచి విద్యార్థులకు స్ఫూర్తిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, పి రాజన్న, కోశాధికారి జామ్‌సింగ్, సహ కార్యదర్శి చట్ల విలాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులపై పోలీసుల దృష్టి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందులపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన రోడ్లతో పాటు చౌరస్తాల్లో కొందరు చిరు వ్యాపారస్తులు రోడ్లపై వచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్న రేకుల షేడ్స్, గ్రీన్ మ్యాట్స్ లను ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ శనివారం దగ్గర ఉండి ట్రాఫిక్ పోలీసులతో కలిసి వాటిని తొలగించారు. ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో వీటిని తొలగించారు. ఇలానే మరోసారి వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.



కార్మికుల సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం

- కార్మికులకు గృహ స్థలం ఇప్పిస్తాం
- టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులను కల్పించిన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు సింగరేణి కార్మికులను కోరారు. శనివారం ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశ్ అధ్యక్షతన బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో జరిగిన ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కేసీఆర్ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోలిండియాలో లేని ఎన్నో హక్కులను కార్మికులకు సాధించి పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ఉద్యోగం కొడుకులకు ఇవ్వడం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్య సౌకర్యం అందించడం, ఉచిత విద్యుత్ ఇవ్వడం, తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వడం, సకలజనుల సమ్మె వేతనాలు చెల్లించడం జరిగిందని అన్నారు. పీహెచ్‌డీలు పెంచడం, అంబేద్కర్ జయంతికి సెలవు ఇవ్వడంతో పాటు రిటైర్డ్ వయసు 61 ఏండ్లకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నో చారిత్రాత్మక హక్కులు కార్మికులకు అందించిన టీబీజీకేఎస్‌ను రాబోయే ఎన్నికల్లో మరొకసారి గుర్తింపు సంఘం గెలిపిస్తే సింగరేణి కార్మికులకు వారు పనిచేసే పని స్థలానికి దగ్గరలోని జిల్లాకేంద్రంలో రెండు గుంటల ఇంటి స్థలం ప్రతి కార్మికుడికి ఇప్పిస్తామని అన్నారు. ఇల్లు కట్టుకుంటే రూ.30 లక్షలు వడ్డీలేని రుణం ఇప్పిస్తామని, కార్మికులకు విధించే ఇన్‌కమ్‌టాక్స్‌ను సింగరేణి యాజమాన్యం తిరిగి చెల్లించడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. జాతీయ సంఘాలు చెప్పే మాయ మాటలు నమ్మకుండా కార్మికులకు అండగా ఉండి ఎళ్లవేళల కార్మికుల హక్కులను సాధించే, సంక్షేమం అందించే టీబీజీకేఎస్ సంఘం బాణం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, లెవన్‌మెన్ కమిటీ మెంబర్ మంగీలాల్, మాజీ వైస్ ప్రెసిడెంట్ నలగొండ సదాశివ్, ఏరియా కార్యదర్శి సంపత్‌రావు, ఏరియా నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశ్, భాస్కరచారి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు బొంగు వెంకటేశం, శ్రీనివాస్, మసాడి నారాయణ, కమిటీ సభ్యులు రాజేశం, ఓరం కిరణ్, కాయిత స్వామి, రమేష్, రామ్మోహన్, మల్లేష్, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావ్ సప్తాహ

నవతెలంగాణ-బేల



సద్గురు బ్రాహ్మలిన్ బాజీ రావ్ బాబా సప్తాహ ముగింపు కార్యక్రమం మండలంలోని పొనాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సప్తాహను పురస్కరించుకొని స్థానిక హనుమాన్ ఆలయంలో కళశా ఘట స్థాపన చేసి సప్తాహను ప్రారంభించారు. వారం రోజులుగా కొనసాగుతున్న ఈ సప్తాహ కార్యక్రమంలో ప్రతి నిత్యం ఉదయం ప్రభాత ఫెరి, ధ్యాన, కీర్తన, ప్రవచన, హరి పాట్ లాంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ముగింపు సందర్భంగా జ్ఞానేశ్వర్, నివృతి, సోపాన, ముక్తాబాయి దేవతా మూర్తుల వేషాదారణలో ఉన్న చిన్నారులను రథంపై ఉరెగించారు. గ్రామస్తులు రథంతో పాటు బాబా చిత్ర పటం పల్లకికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భజన బృందాలు గ్రామంలో శోభా యాత్రలో పాల్గొని భక్తి భావాన్ని చాటారు. వివిధ గ్రామల నుండి వచ్చిన బాబా భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శోభాయాత్ర అనంతరం దహి హండి కాళ అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు. సప్తాహ ముగింపు వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న హాజరై బాబా పల్లకికి పూజలు చేశారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ మండల నాయకులు శోభయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుడిమేత యశోద శత్రుగన్, పొనాల బాజీరావ్ బాబా భక్తులు పాల్గొన్నారు.